ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 19 సెప్టెంబరు 2024



అవినీతిపరుల సమాచారం ఇస్తే రూ.10వేల నజరానా
8లో..

15రోజుల్లో లాభాల వాటా ఇప్పిస్తాం..
8లో..

వినియోగదారులకు చేరువలో..



- 19 ఫీచర్లతో టీజీఎన్‌పీడీసీఎల్ యాప్
- విద్యుత్ సమస్యలన్నింటికీ యాప్ ద్వారా పరిష్కారం
- ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని పెంచుతున్న ఉన్నతాధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

విద్యుత్ అవసరం లేని మనిషి ఉండడు. అది గుడిసె అయినా, ఇల్లు అయినా విద్యుత్ కనెక్షన్ తీసుకోవాల్సిందే. ప్రతిదీ విద్యుత్‌తో ముడిపడి ఉంటున్నాయి. స్నానానికి నీళ్లను వేడి చేసేందుకు హీటర్లు వాడుతు న్నారు. బట్టలు ఉతకడానికి ఎలక్ట్రికల్ వాషింగ్ మెషిన్లు, అన్నం వండు కునేందుకు ఎలక్ట్రిక్ కుక్కర్లు వినియోగిస్తున్నారు. సెల్‌ఫోన్ల చార్జింగ్ కోసం విద్యుత్ వాడకం తప్పనిసరైంది. ఒకప్పుడు విద్యుత్ మూడు, నాలుగు గంటలు పోయినా కూడా భరించారు. కానీ ఇప్పుడు అరగంట విద్యుత్ లేకపోయినా భరించలేకపోతు న్నారు. వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా గురించి ఆరా తీస్తున్నారు. బిల్లులు చెల్లించడానికి ఆఫీస్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. మొబైల్‌లో యాప్ ద్వారా చెల్లించుకోవచ్చు. కొత్త మీటర్ కోసం దరఖాస్తు చేసుకో వాలన్నా, ఆ శాఖ ద్వారా ఏ పని చేసుకోవాలన్నా నేరుగా టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ వినియోగిస్తే పనులు వాటంతటా అవే అవుతాయి. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. పనిలో జవాబుదా రీతనాన్ని పెంచేందుకు ఎనిమిది మాసాల నుంచి టీజీఎన్‌పీడీసీఎల్‌లో అనేక సంస్కరణలు తీసుకవస్తున్నారు. అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెడుతున్నారు. తాజాగా వినియోగదారుల సౌకర్యార్థం టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను 19 ఫీచర్లతో రూపొందించారు. దీంతో వినియోగదారులకు సులువుగా మారింది.

● **రిపోర్ట్స్ ఆన్ ఇన్సిడెంట్:** ఎక్కడైనా ఎటువంటి సంఘటన జరిగినా ఇందులో జీపీ ఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుని ఫోన్‌లోని కెమెరా నుంచి ఆ సంఘటను ఫోటో తీసి పంప వచ్చు. తద్వారా రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. వెంటనే ఆ అధికారి స్పందించి ఆ సమస్యను పరిష్కారం చేస్తారు.

● **కన్స్యూమర్ గ్రీవెన్సెస్**

1) న్యూ కంప్లైంట్: వినియోగదారునికి సంబంధించిన సమస్యలను నేరుగా ఇందులో పొందుపరచవచ్చు. వారి మీటర్ నంబర్, సమస్య తాలూకు వివరాలు ఇందులో నమోదు చేస్తే ఆ సమస్యను పరిష్కరించనున్నారు. విద్యుత్‌కు సంబంధించిన ప్రతి అంశంపై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం ఇందులో ఉంది..

2) కంప్లైంట్ స్టేటస్: ఫిర్యాదు చేసిన సమస్య స్టేటస్‌ను ఇందులో చూసుకునే సౌలభ్యం ఉంది.

3) రీ ఓపెన్ కంప్లైంట్: ఫిర్యాదు చేసిన సమస్యపై సంతృప్తి చెందకపోతే మరల పునరావృతం చేసుకునే వీలుంది.

● **సెల్ఫ్ రీడింగ్:** ఇందులో వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతి నెల వారి విద్యుత్ బిల్లులను స్వయంగా సెల్ఫ్ మీటర్ రీడింగ్ చేసుకోవచ్చు.

● **పేబిల్స్:** నెలవారి విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని చెల్లించ వచ్చు. ఇది చాలా సులభం, సౌకర్య వంతం, వేగవంతం, సురక్షితం. సమయం ఆదా చేసుకోవచ్చు. కేవలం రెండు నిమిషాల్లో చెల్లించవచ్చు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కటి డిజిటలైజేషన్‌గా మారుతుంది. కనుక ఇలా చెల్లిం పులు చేయడం శ్రేయస్కరం.

● **బిల్ హిస్టరీ: వినియోగ దారులు** చెల్లించిన విద్యుత్ బిల్లుల చెల్లింపు గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చని తద్వారా ప్రతి నెల బిల్లు ఎంత వస్తుందో పోల్చుకో వచ్చు. అలాగే విద్యుత్ వినియో గడం ఏ నెల ఎంత పెరిగిందని చూసుకోవచ్చు. తద్వారా పొదుపు చేసుకొని బిల్లు తగ్గించుకోచ్చు.

● **సేఫ్టీ టిప్స్:**

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలను వివరించడం జరిగిందని, ఎప్పటికప్పుడు వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నామని విద్యుత్ అనేది ప్రమాదకరం అని ప్రతి ఒక్కరు గుర్తించాలని, స్వీయ నియంత్రణ ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లో స్వంతంగా రిపేర్లు చేయకూడదని ఈ సందర్భంగా కోరారు.

● **కాంటాక్టు అజ్..**

ఇందులో 24/7 పనిచేసే టోల్‌ఫ్రీ నంబర్లు ఉంటాయని, సమస్యల పరిష్కారం కోసం సంప్రదించి, సమస్యలను పరిష్కరించే వెసులుబాటు ఉంది. ఆ టోల్‌ఫ్రీ నంబర్లు 18004250028, 1912. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మరింత నాణ్యమైన, మెరుగైన సేవలు పొంది సంస్థకు సహకరించి, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బొంకూరి సుదర్శన్ వినియోగదారులను కోరారు.

● **ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ:** ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన తాలూకు సమాచారం ఇందులో ఉంటుందని వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారాచెల్లించినసమాచారం ఇందులోవినియోగదారులు తెలుసుకోవచ్చు.

● **లింక్ ఆధార్ మొబైల్:** వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్ చేసుకోవడం వలన విద్యుత్ బిల్లుల ప్రతి సమాచారం ప్రతి నెలా ఫోన్‌లకు సమాచారం అందుతుంది. అలా సమాచారం రావడం వలన వెంటనే యాప్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చు.

● **డొమెస్టిక్ బిల్ క్యాలిక్యులేటర్:** వినియోగదారుల నెల వారి విద్యుత్ వినియోగం తాలూకు మీటర్ రీడింగ్ వివరాలు ఇందులో పొందుపరిస్తే బిల్లు తాలూకు పూర్తి సమాచారం వివరాలు చూపుతుంది.

● **పేరు, లోడ్ మార్పు గురించి:** విద్యుత్ మీటర్ పేరు మార్పు గురించి సవివరాలు, లోడ్ గురించి వివరాలు ఇందులో ఉన్నాయి. ఆ వివరాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి.

● **పవర్ కంజంప్షన్ గైడ్ లైన్స్:** విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

● **టారిఫ్ డీటెయిల్స్:** విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు క్యాటగిరీల వారీగా ఇందులో సవివరంగా ఉంటాయి. గృహ వినియోగదారులు, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, తదితర వివరాలు కేటగిరీల వారీగా చార్జీల వివరాలు పొందుపరిచారు.

● **ఫీడ్ బ్యాక్:** వినియోగదారులకు అందిస్తున్న సేవల పట్ల ఇక్కడ వారి అభిప్రాయాన్ని పంచుకోవచ్చని, ఇది చాలా ముఖ్యం అని అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

● **మై అకౌంట్:** మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి.వారిమీటర్ తాలూకు వివరాలు ఉంటుంది.

● **ఎనర్జీ సేవింగ్ టిప్స్:**

ఇందులో విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు ఆచరించవలసిన పొదుపు సూచనలు విపులంగా పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు చేయడానికి సూచనలను అనుసరించి విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి.

● **వినియోగదారుల బిల్లు సమాచారం:** వినియోగదారుల బిల్లు తాలూకు సమాచారం ఉంటుందని, ఇందులో వినియోగదారుల సర్వీస్ నంబర్‌ను నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

● **వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు** : వినియోగదారుల పరిధిలోని అధికారిని సంప్రదించాలంటే ఇందులో నుంచి తెలుసుకోవచ్చు. వినియోగదారులకు ఎటువంటి సందేహాలు ఉన్న మీ పరిధిలోని అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



పంచాయతీ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు సంపూర్ణ సహకారం అందించాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులను కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. బుధవారం కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 13న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించామన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో గల అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను సెప్టెంబరు 21లోపు సంబంధిత మండలాల ఎంపీడీవోలకు లిఖితపూర్వకంగా సమర్పించాలని, 26లోపు అభ్యంతరాలను పరిష్కరించి, 28న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీవో వీరభూచయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర సదానందం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శశిభూషణ్ కాచె, బీఆర్ఎస్ ప్రతినిధి ఉప్పురాజ్ కుమార్, బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ పి సంపత్‌రావు, సీపీఎం ప్రతినిధి ముత్యంరావు, బీఎస్పీ ప్రతినిధి శారద, రాజ నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ రామగుండం ఇన్‌చార్జి ఆశ్‌పాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్సకు అవసరమైన పరికరాలు సిద్ధం



పరికరాల పనితీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 18 : జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగాన్ని పరిశీలించారు. 4లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా కొనుగోలు చేసిన వైద్య పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ పరికరాలను వినియోగించాలని వైద్యులకు సూచించారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న కంటి శస్త్రచికిత్స విభాగాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి కంటి శస్త్రచికిత్స విభాగాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కంటి చికిత్స విభాగంలో 7 లక్షల రూపాయలు ఖర్చు చేసి అవసరమైన పరికరాల కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని డెంటల్ ఓపీ పరిశీలించిన కలెక్టర్ ఆ విభాగంలో 2లక్షలతో కొనుగోలు చేసిన పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. డెంటల్ ఫిల్లింగ్ సేవలు ప్రారంభించడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యులను ప్రశంసించారు. ఆస్పత్రి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ రవీందర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు డెంటల్ కంటి శస్త్ర చికిత్స డాక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు

- వ్యాపార కేంద్రాలపై ఫోకస్ - మరో ఏడు రోడ్ల విస్తరణ ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం - క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్

కోల్‌సిటీ, సెప్టెంబరు 18: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపార కేంద్రాల అభివృద్ధిపై ఫోకస్‌పెట్టారు.ఇప్పటికే టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100 కోట్లు రామగుండంలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి మంజూరు చేశారు. గోదావరిఖనిలో వ్యాపార కేంద్రాల అభివృద్ధికే రూ.30కోట్లు కేటాయించారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. త్వరలోనే పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే రోడ్ల విస్తరణకు సింగరేణి క్వార్టర్లన కూల్చివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి సంస్థ కూడా ఆ క్వార్టర్లలో ఉంటున్న కార్మిక కుటుంబాలకు మరో చోట క్వార్టర్లు కేటాయిస్తుంది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తి మేరకు రోడ్ల విస్తరణలో చిన్నచిన్న అడ్డాలు కోల్పోతున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా రూ.10కోట్లతో కాంప్లెక్స్ నిర్మించేందుకు సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేసింది. మంజూరు కూడా ఇచ్చింది. కాగా లక్ష్మీనగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి, వీధి దీపాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర పనులకు రూ.30కోట్లు కేటాయించారు. వ్యాపార ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రోడ్ల విస్తరణ ఉండాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా గోదావరిఖని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లోని రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు చేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏడు రోడ్ల విస్తరణ పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీని ఆధారంగా రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఆర్‌డీపీ) అప్రూవల్ తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



రోడ్డు విస్తరణ కోసం గతంలో ఇచ్చిన మార్కింగ్

లక్ష్మీనగర్‌లోని ఓల్డ్‌అశోక టాకీస్ నుంచి శక్తి ఎలక్ట్రికల్ మీదుగా సాయి జువెల్లర్స్, మార్కండేయకాలనీ గణేష్‌నగర్ బోర్డు నుంచి విజయ పిల్లల హాస్పిటల్, రీగల్ షూమార్ట్ నుంచి బాలాజీ స్వీట్‌హౌస్, రాజేష్ శర్మ ఇంటి నుంచి బాలాజీ స్వీజ్ హౌస్, కళ్యాణ్‌నగర్ మెయిన్ రోడ్డు నుంచి ప్రాఫిట్ షూమార్ట్, స్వతంత్ర చౌక్ నుంచి పాత మున్సిపల్‌ఆఫీస్ వరకు రోడ్డు విస్తరించి రీగల్ షూమార్ట్ జంక్షన్‌ను విస్తరించి అభి వృద్ధి చేయనున్నారు. కాగా ఎన్ని అడుగులుగా రహదారిగా విస్తరించాలనేది ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు. క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుగుణంగా రోడ్ల విస్తరణ ప్రతిపాదన చేసి ఆర్‌డీపీ తీసుకోవాలని నిర్ణయించారు.

2017లోనే 8 రహదారులకు ఆర్‌డీపీ..

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 8 రహదారులకు 2017 మేలో ప్రతిపాదన చేశారు. వీటిలో ఆరు రహదారులకు ఆర్‌డీపీ ఆమోదం కూడా లభించింది. మార్కండేయకాలనీ-సంజయ్‌నగర్, గాంధీనగర్ 60అడుగులు, రీగల్ షూమార్ట్ నుంచి లక్ష్మీనగర్ 40అడుగులు, అంబిక మెడికల్ స్టోర్ నుంచి బాలాజీ స్వీట్‌హౌస్ మీదగా పాపులర్ షూమార్టు వరకు 40అడుగులు, స్వతంత్ర చౌక్ నుంచి త్రివేణి కాంప్లెక్స్ వరకు 40అడుగులు, గణేష్‌నగర్ బోర్డు నుంచి విజయ హాస్పిటల్ వరకు 30అడుగులు, కళ్యాణ్‌నగర్ నుంచి అడ్డగుంటపల్లి వరకు 60అడుగుల రోడ్ల విస్తరణ చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాగా అప్పుడున్న రాజకీయ పరిస్థితులను బట్టి లక్ష్మీనగర్ రాజేష్‌శర్మ ఇంటి నుంచి పాపులర్ షూ మార్ట్, రీగల్ షూమార్ట్ నుంచి బాలాజీ స్వీట్‌హౌస్, విజయ హాస్పిటల్ నుంచి గణేష్‌నగర్ బోర్డురోడ్డు రహదారుల విస్తరణను పెండింగ్‌లో పెట్టారు. మార్కండేయకాలనీ రహదారికి 60అడుగులకు ఆర్‌డీపీ రాగా 50అడుగులకు మార్కింగ్‌ఇచ్చారు. ప్రస్తుతం ప్రతిపాదించిన ఏడు రోడ్లలో నాలుగు రోడ్లకు ఇప్పటికే ఆర్‌డీపీ అప్రూవల్ ఉంది. గతంలో మార్కింగ్ కూడా ఇచ్చారు. కాగా రహదారులకు ఆర్‌డీపీ అప్రూవల్ అయినా కూడా విస్తరణను పెండింగ్‌లో పెట్టారు. అజయ్ మెడికల్ స్టోర్ నుంచి పాపులర్ షూమార్ట్ రహదారిలో ప్రస్తుతానికి కొన్నిచోట్ల 12నుంచి 15 అడుగుల రోడ్డు ఉంది. బాలాజీ స్వీట్ హౌజ్ తరువాత కొన్ని చోట్ల 30అడుగులుగా ఉంది. ఇక్కడ 40అడుగులను ప్రతిపాదించారు. 2017లో అప్పటి ప్రజాప్రతినిధులపై కొందరు వ్యాపారులు ఒత్తిడి తీసుకువచ్చి విస్తరణను నిలిపివేయించారు.



ఇరుకుగా ఉన్న లక్ష్మీనగర్ వీధులు

నష్టపరిహారం లేదు.. టీడీఆర్‌లే..

రామగుండం నగరపాలక సంస్థలో రోడ్ల విస్తరణలో అభివృద్ధి దృష్ట్యా వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరించాలని కార్పొరేషన్ పేర్కొంటున్నది. అనివార్యంగా భవనం ఎక్కువ శాతం కోల్పోతే బాధితులకు మున్సిపల్ చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ నష్టపరిహారం కూడా ఖజానా నుంచి ఇవ్వడం కాకుండా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) రూపంలో ఇవ్వనున్నారు. ఈ టీడీఆర్‌లను రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో నిర్మాణ అనుమతుల ఫీజుల చెల్లింపులకు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఈ టీడీఆర్ పొందిన వారికి భవన నిర్మాణ అనుమతుల విషయంలో వెసులుబాటు కూడా ఉంటుంది.

'ఖని'లో జబర్దస్త్ టీమ్ సందడి

- వాసవి షాపింగ్ మాల్ ప్రారంభం





షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జబర్దస్త్ ఫేమ్ వర్ష

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 18: గోదావరిఖని పట్టణంలో బుధవారం జబర్దస్త్ టీమ్ సందడి చేసింది. లక్ష్మీనగర్‌లోని వాసవి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా జబర్దస్త్ ఫేమ్ వర్ష, బుల్లెట్ భాస్కర్, నరేష్ హాజరయ్యారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీమ్ షో నిర్వహించింది. జబర్దస్త్ నటులు గోదావరిఖనికి రావడంతో మహిళలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో లక్ష్మీనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేయర్ అనీల్ కుమార్, షాపు నిర్వాహకులు ఆవునూరి శంకర్, ఆవునూరి శివ ప్రసాద్, కార్పొరేటర్లు గణముక్కుల మహాలక్ష్మి, మహంకాళి స్వామి, ముస్తాఫా, అడ్డాల స్వరూప, నీల పద్మ, నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, చిదురాల రవీందర్, గంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో భారీ వినాయకుడి నిమజ్జనం

- వేలంపాటలో రూ.2లక్షల 27 వేలు పలికిన లడ్డూ..



నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 18: పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 54 అడుగుల మట్టి వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. లడ్డూ వేలం పాట నిర్వహించగా 2 లక్షల 27 వేల రూపాయల ధర పలికింది. అలాగే బ్రహ్మ కలశం 93 రూపాయలకు వేలం వేశారు. అనంతరం పైపుల ద్వారా నీటితో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన చోటనే నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బ్యాంకు అప్పు చెల్లించని బకాయిదారుడి భూమి వేలం

మంథనిరూరల్, సెప్టెంబరు 18: బ్యాంకులో తీసుకున్న రుణం తీర్చకపోవడంతో అధికారులు బకాయిదారుడి భూమిని వేలం వేశారు. మంథని మండలంలోని మైదుపల్లి గ్రామశివారులోని భూమిని మంథని కేడీసీసీ బ్యాంక్‌లో తనఖా పెట్టి బిజినెస్ లోన్ తీసుకొని తిరిగి చెల్లించని బకాయిదారుడి భూమికి గ్రామంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో బహిరంగవేలం బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన బంధం సుప్రియ బ్యాంక్‌లో బిజినెస్ లోన్ తీసుకున్నారు. తిరిగి చెల్లించకపోవడంతో గ్రామపంచాయతీ అవరణలో వేలం నిర్వహించారు. 9 మంది పాల్గొనగా గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సౌజన్య భూమిని వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కే. ఉదయశ్రీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ దిలీప్, పీఏసీఎస్ సెక్రెటరీ మామిడాల అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఇనుపరాడ్లను దొంగిలించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

మానకొండూర్, సెప్టెంబరు 18 : మానకొండూర్ చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల ఇనుపరాడ్లను చోరీ చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి జున్నూతుల రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఇందిరానగర్ వద్ద ఒకే రోజు మూడు ప్రమాదాలు

● వరుస ప్రమాదాలతో జనం ఆందోళన



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు

తిమ్మాపూర్, సెప్టెంబరు18: మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్ రహదారిపై బుధవారం ఒకే రోజు గంటల వ్యవధిలో మూడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కి చెందిన అలువాల శంకర్ తన ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఇందిరానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా నుస్తులాపూర్ వైపు నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొని వాహనాలపై ఉన్న ముగ్గురు ఎగిరి పడ్డారు. ఇందులో అలువాల శంకర్‌కు కాలు విరగగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అదే స్థలంలో మరో గంట వ్యవధిలోపల మరో రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందిరానగర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎలుక బాలయ్య తన ద్విచక్ర వాహనంపై ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారి దాటుతుండగా హైదారాబాద్ వైపు నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని తప్పించుకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఎలుక బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మూడవ రోడ్డు ప్రమాదం రాత్రి 9గంటల సమయంలో చోటుచేసుకుంది. బీహార్‌కి చెందిన బోధ్ అనే వ్యక్తి ఇందిరానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఓ కారు అతివేగంగా ఢీకొనడంతో బోధ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 10 రోజులుగా ఇందిరానగర్ గ్రామ స్టేజీ రాజీవ్ రహదారిపై 8 రోడ్డు ప్రమాదాలు సంబవించగా 9మంది గాయపడ్డారు.

క్వారీ తవ్వకాలను నిలిపివేయాలి


క్వారీ వద్ద నిరసన తెలుపుతున్న గొర్రెల కాపర్లు

గన్నేరువరం, సెప్టెంబర్ 18: మండలంలోని హన్మాజిపల్లి గ్రామశివారులో ఉన్న బోడగుట్టపై ప్రారంభించిన గ్రానైట్ క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని గొర్లు మేకల పెంపకందారుల జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని గొర్లకాపరులతో కలిసి క్వారీ నిర్వహిస్తున్న బోడగుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ నిర్వహణతో జీవాల మేతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రామంలో గొర్ల పెంపకం వృత్తి మీద ఆధారపడి ఉన్న 40 కుటుంబాలు గుట్టకు జీవాలను మేపుతూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. బ్లాస్టింగ్‌ల శబ్దానికి గుట్టను ఆవాసంగా చేసుకొని నివసిస్తున్న వన్యప్రాణులు గ్రామంలోకి వస్తున్నాయని అన్నారు. బ్లాస్టింగ్‌లతో సమీపంలోని గ్రామాలలో ఇండ్లు బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి క్వారీ పనులను నిలిపివేసేందుకు అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల నాయకులు తమ్మనవేణి శ్రీనివాస్, దాడి మహేందర్, కేశవేణి శ్రావణ్, రాజయ్య, రవి, పురుషోత్తం, పర్శరాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిరాలతో సంస్కృతి పరిరక్షణ

• నేనూ శిశుమందిర్ విద్యార్థినే • కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

జమ్మికుంట, సెప్టెంబర్ 18 : శిశుమందిరాలు భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందిస్తూ విద్యను అందిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో రూ. 1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన బాలికల వసతిగృహం భవనాన్ని బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతో పాటు తమ అన్నయ్యలు, అక్కయ్య కూడా శిశుమందిర్‌లోనే చదువుకున్నారని అన్నారు. జమ్మికుంట శిశుమందిర్ పూర్తిస్థాయిలో రెసిడెన్షియల్ పాఠశాలగా మారడం సంతోషంగా ఉందని అన్నారు. శిశు మందిర్‌లకు నిధులెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ యుగంలో విదేశీ విచ్చలవిడి సంస్కృతి కొనసాగు తున్న ఈ రోజుల్లో శిశుమందిరాలు ఎదుగుతూ నిలబడుతుండటం గొప్ప విషయం అన్నారు. కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్ల, ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నారన్నారు. శిశు మందిరాల్లో చదువుకున్న వారు ఏ రంగంలో ఉన్నా జాతీయవాద భావజాలంతో పని చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజనం బాధ్యత కూడా ప్రధానోపాధ్యాయులపైనే పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. శిశుమందిరాలకు ప్రభుత్వం నుంచి సహకారం లేదన్నారు. చీపురుపుల్లతో కూడా ఏకే-47లు తయారు చేసేంతటి శిక్షణ ఇస్తూ ఉగ్రవాదాన్ని పెంచిపోషి స్తున్న మదర్సాలకు ప్రభుత్వాలు నిధులు ఎందుకు ఇస్తున్నాయన్నారు.

• తుమ్మేటి కుటుంబ సభ్యులకు పరామర్శ

ఇటీవల మృతిచెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. తుమ్మేటి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ రమేష్, తేలే రాజమౌళి, డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పచ్చిక శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ వేముల రఘుపతిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజయ్య, జీడి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ఐదవ ర్యాంక్

• జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్



పాత మున్సిపల్ కార్యాలయంలో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జమ్మికుంట, సెప్టెంబర్ 18: తెలంగాణ రాష్ట్రంలో ఇంటి పన్నుల వసూళ్లలో జమ్మికుంట మున్సిపాలిటీ ఐదవ ర్యాంక్ సాధించిందని మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మహిళ సంఘం సభ్యులకు తడి, పొడి చెత్తపై కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో చెత్త సేకరణలో కూడా మంచి ర్యాంక్ సాధించే దిశగా ముందుకు వెళ్తామన్నారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 17వాహనాలు చెత్త సేకరించేందుకు తిరుగుతున్నాయన్నారు. చెత్త బండ్లు ఇంటి ముందుకు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రావికంటి రాజు, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, సంఘం సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



గోదావరి నదిలోనికి ట్రాక్టర్లు దిగకుండ కందకాన్ని తోడుతున్న జేసీబీ

బీర్పూర్, సెప్టెంబరు 18 : అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్‌చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ ముంతాజుద్దీన్ ఆధ్వర్యంలో గోదావరి నది పరివాహక ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో చిన్న కొల్వాయి గ్రామం సమీపంలోని గోదావరి ఒడ్డున అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు ఉండడంతో మైనింగ్ అధికారులకు సమాచారం అందించి ఇసుక డంపులను సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సుమారు 75 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు ఉన్నట్లు అంచనా వేశారు. ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. గోదావరి నదిలోనికి ట్రాక్టర్లు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కందకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం మైనింగ్ ఏడీ జైసింగ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ట్రాక్టర్ యజమానులు గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే మొదటిసారిగా 25,000 వేల రూపాయలు, రెండోసారి 50,000వేల రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. మూడోసారి పట్టుబడితే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కొంతమంది ట్రాక్టర్ యజమానులు వ్యవసాయ అనుమతులతో ఉన్న ట్రాక్టర్లను అక్రమంగా ఇసుక తరలించడానికి ఉపయోగిస్తున్నారని ఇది సరైనా పద్ధతి కాదని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిబిరంలో ఎన్‌సీసీ కెడెట్ల ప్రతిభ



ఎన్‌సిసి శిబిరంలో ప్రతిభ చాటిన ఎన్‌సిసి కెడెట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18: నైన్ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కెడెట్లు జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో జరిగిన తలసైనిక్ శిక్షణ శిబిరంలో పాల్గొని విశేష ప్రతిభ చాటారు. కరీంనగర్ నుంచి జి.అభిషేక్, కె.హన్సికలు బంగారు పతకాలను సాధించారని కమాండింగ్ అధికారి కల్నల్ డెనియల్ లాట్జం తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఎన్‌సిసి కెడెట్ల నుంచి నైన్ టి బెటాలియన్ కెడెట్లు విశేష ప్రతిభ చాటి మ్యాప్ రీడింగ్‌లో జి అభిషేక్ (ఎస్ఆర్ఆర్ కళాశాల) ఫైరింగ్ విభాగంలో కె హన్సిక (సెయింట్ జార్జ్ పాఠశాల) కెడెట్లు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వారిని ఎన్‌సిసి బెటాలియన్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ, చంద్రశేఖర్ ఎన్‌సిసి అధికారి కెప్టెన్ రేండ్ల సంజీవ్ సుబేదార్ మేజర్ సూర్యప్రసాద్, బి రజిత, తదతితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

కోరుట్ల, సెప్టెంబరు 18 : మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో కోరుట్ల పట్టణంలోని టీజీఎంఆర్ఎస్ కోరుట్ల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శంకర్ బుధవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విష్ణువర్ధన్, ఎండీ అయాన్ 60 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపియినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. క్రీడలలో రాణించిన విద్యార్థులతో పాటు పీఈటీలు సంజయ్, రాజేష్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

• గురుకుల విద్యార్థులు..

పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీలలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ బండి బాబు బుధవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మధు 200 మీటర్లు, రిశ్వంత్ 1000 మీటర్ల పరుగు పందెంలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై విద్యార్థులతో పాటు పీడీ, పీఈటీలు అజయ్, జగన్‌లను ప్రిన్సిపల్ బండి బాబు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ అభినందించారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

ట్రాక్టర్ కిందపడి యువకుడి దుర్మరణం



రాకేశ్‌రెడ్డి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో వినాయక నిమజ్జనోత్సవంలో బుధవారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి న్యాలకొండ రాకేష్‌రెడ్డి(18) అనే యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. దుమాలకు చెందిన రాకేష్ రెడ్డి ఇంటర్ వరకు పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. తోటి స్నేహితులతో కలిసి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బుధవారం రాత్రి నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ట్రాక్టర్‌ను ఆన్ చేసి వాహనంలో డీజిల్ పోసేందుకు మూత తీస్తున్న క్రమంలో గేర్ పడి ఒక్కసారిగా వాహనం ముందుకు వెళ్లింది. దీంతో ట్రాక్టర్ కింద పడిన రాకేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించే లోపు రాకేశ్‌రెడ్డి చనిపోయాడు. యువకుడి తండ్రి రఘుపతి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి మాధవి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18 : కరీంనగర్ రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన మంచె ప్రకాశ్ ఈనెల 14న కుటుంబంతో ఊరికి వెళ్ళగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి 3 తులాల బంగారం, ఇతర వెండి వస్తువులు ఎత్తుకుపోయారు. ప్రకాశ్ బుధవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని ఆభరణాలు కనపడలేదు. బాధితుడు కరీంనగర్ ఒక టో టాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

సహకార సంఘంలో అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

వీణవంక, సెప్టెంబర్ 18: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవతవకలు జరిగాయని విశ్రాంత ఉద్యోగి ముదిగంటి రఘునాథరెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం జిల్లా సహాయ రిజిస్ట్రార్ కరణ్‌కుమార్ విచారణ చేపట్టారు. సహకార సంఘంలో 2016 నుంచి 2020 వరకు కొనుగోలు కేంద్రాలలోకి వచ్చిన గోనె సంచుల్లో అవకతవకలు జరుగడంతో సంఘానికి వచ్చే రూ.37 లక్షలు తీసుకున్నారని, సంఘానికి నష్టం వాటిల్లిందని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సహాయ రిజిస్ట్రార్ కరణ్‌కుమార్ సహకార సంఘంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు సంఘం సిబ్బందిని విచారించారు. విచారణ అధికారి మాట్లాడుతూ సంచుల్లో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదుతో విచారణ జరుపుతున్నామని విచారణ పూర్తి చేసి జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 : తెలంగాణ ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబరు 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు 16 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సంబంధిత అధ్యయన కేంద్రానికి వెళ్లి హాల్‌టికెట్స్ తీసుకోవాలన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 18: గురుకుల ఉపాధ్యా యుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ టిమ్రిస్ రాష్ట్ర కార్యదర్శి భూపేందర్‌కౌర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గురుకుల యాజమాన్యాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సి పాల్స్, జెఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఈనెల 28న హైదరాబా ద్‌లో జరిగే మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల పెంపు



కాకతీయ కాలువ ద్వారా దిగువకు భారీగా ప్రవహిస్తున్న నీరు

తిమ్మాపూర్, సెప్టెంబరు18 : కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటి విడుదలను బుధవారం ఇరిగేషన్ అధికారులు పెంచారు. కాకతీయ కాలువ నుంచి దిగువకు 500క్యూసెక్కుల నీరు విడుదల చేసిన అధికారులు సోమవారం 3వేల క్యూసెక్కులకు పెంచారు. తిరిగి బుధవారం ఉదయం 8గంటల సమయంలో మరో వెయ్యి క్యూసెక్కులు పెంచి ప్రస్తుతం 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఎల్ఎండిలో 23.689 టీఎంసిల నీరు నిల్వ ఉంది.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

మంథని, సెప్టెంబర్ 18: నిబంధనలు ఉల్లంఘించి వినాయక నిమజ్జనంలో డీజేలు ఏర్పాటు చేసిన కాకర్ల పల్లికి చెందిన అర్వింద్, కైర్‌తోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బుధవారం తెలిపారు. మంగళవారం నిమజ్జనం సందర్భంగా వారు నిబంధనలు ఉల్లంఘించినందుకు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

వెల్గటూర్, సెప్టెంబరు 18: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి గుండె పోటుతో బుధవారం మృతి చెందాడు. గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పబ్బ రవీందర్(51)అనే వ్యక్తి బుధవారం పౌర్ణమి కావడంతో దండేపల్లి మండలం గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి దర్శనం చేసుకోవడానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కిన వ్యక్తి వెల్గటూర్ సమీపంలో హఠాత్తుగా గుండె పోటుకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే బస్సులో ఉన్న వారు ప్రథమ చికిత్సతో పాటు సీపీఆర్ చేసినా లాభం లేకపోయింది. ప్రయాణికులు 108కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది రవీందర్‌ను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం



పామును పట్టుకున్న ఖాసీం

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 18: జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం నాగుపాము కలకలం సృష్టించింది. రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలోకి పాము రావడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు గందరగోళానికి గురయ్యారు. అయితే కార్యాల య సిబ్బంది మల్యాల మండల కేంద్రానికి చెందిన ఖాసీం అనే పాములు పట్టే వ్యక్తికి సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సిమ్స్ ఎదుట స్వచ్ఛంద సంఘాల ధర్నా

• మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు నిరసన



నిరసన తెలుపుతున్న ఐక్య సంఘాల నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెం బరు 18: సింగరేణి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పనిస్థలాల్లో మహిళా ఉద్యోగులపై వేధింపులను నిరసిస్తూ స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఐత శివకుమార్, నాయకుడు మద్దెల దినేష్ మాట్లాడుతూ కళాశాలలో రోజురోజుకు మహిళా ఉద్యోగులపై వేధింపులు పెరుగుతున్నాయని, రెండు నెలలక్రితం ఇదే కళాశాలలో ఓ సూపర్‌వైజర్ పారిశుధ్య విభాగానికి చెందిన ఓ మహిళ ఉద్యోగిపై లైంగిక దాడికి పాల్పడ్డారని, అతనిపై ఇప్పటికీ పోలీస్ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రెండు రోజులక్రితం సెక్యూరిటీ సూపర్‌వైజర్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఓ మహిళను వేధించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాల్ కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. రెండు సంఘటనలు జరిగినా ఇప్పటి వరకు చర్యలు శూన్యమని, రెండు నెలల క్రితం ఓ సూపర్‌వైజర్ మహిళ ఉద్యోగాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారని, వారిని ఇప్పటికీ కూడా పనిలోకి తీసుకోలేదన్నారు. స్థానికులకు ఏజెన్సీ ఇవ్వకుండా హైదరాబాద్‌లో ఉండే వారికి ఏజెన్సీలు అప్పజెప్పుతూ ఏజెన్సీ నిర్వాహకుడు డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. మెడికల్ కళాశాలలో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని, ప్రిన్సిపాల్ కళాశాలలో జరిగే సంఘటనలపై మౌనంగా ఉండడం పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ఈ నిరసనలో స్వచ్ఛంద సంఘాల నాయకురాలు గోలివాడ చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళకు ఏడాది జైలు శిక్ష

సిరిసిల్లక్రైం, సెప్టెంబరు 18 : కరీంనగర్‌కు చెందిన కిన్నెర మల్లవ్వ అనే మహిళకు ఏడాది జైలు శిక్ష విధి స్తూ బుధవారం సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారని సిరిసిల్ల డీఎస్పీ చంద్ర శేఖర్‌రెడ్డి తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని జంగారెడ్డిపల్లెకు చెందిన వొల్లాల మల్లయ్య వద్ద కిన్నెర మల్లవ్వ 2017లో రూ.4.30 లక్షలు అప్పు తీసు కుంది. తిరిగి అతడి కూతురు వివాహానికి ఇస్తానని చెప్పింది. 2018లో మల్లయ్య తన కూతురి వివాహం కోసం మల్లవ్వను డబ్బులు అడిగాడు. ఇవ్వక పోవ డమే కాకుండా బెదిరింపులకు పాల్పడింది. తన కూతురు వివాహం ఆగిపోతుందని మనోవేదనకు గురైన మల్లయ్య 19 ఆగస్టు 2018న పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో కేసున మోదు చేశారు. ఆత్మ హత్యకు కారణమైన మల్లవ్వను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్ పదిమంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ వేముల లక్ష్మిప్రసాద్ వాదించారు. పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మల్లవ్వకు ఏడాది జైలు శిక్ష విధించారని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పీపీ లక్ష్మిప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ నవీన్, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌ను ఎస్పీ అభినందించారు.

వివాహిత అదృశ్యం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 18 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర ప్రాంతానికి చెందిన తరున్నుమ్ అనే వివాహిత అదృశ్యం అయినట్లు పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తరు న్నుమ్ రెండు రోజుల క్రితం ఇంటి బయటకి వెళ్లి తరిగిరాకపోవడంతో భర్త మునావర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 18 : సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో మురికి కాలువ వద్ద 50 సంవత్సరాలకు పైబడిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మెరున్‌కలర్ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. చనిపోయిన వ్యక్తి వెంట బ్యాగు ఉందని తెలిపారు. వివరాలు తెలిసిన వారు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు.

కువైట్‌లో జగిత్యాల వాసి మృతి



సాయికృష్ణ గౌడ్ (ఫైల్)

జగిత్యాల క్రైం, సెప్టెం బరు 18 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కటికవాడకు చెందిన కొత్తకొండ సాయికృష్ణగౌడ్(37) కువైట్‌లో గుండె పోటుతో మృతిచెందాడు. సాయి కృష్ణగౌడ్ ఉపాధి కోసం 10 సంవత్సరాలుగా కువైట్‌లో ఉపాధి పొందుతున్నాడు. రెండు రోజులక్రితం విధులు ముగించుకుని తన రూంకు వచ్చిన సాయికృష్ణ గౌడ్ గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. బుధవారం జగిత్యాలకు సాయి కృష్ణగౌడ్ మృతదేహం చేరుకోగా బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18: కరీంనగర్ రూరల్ మండలంలో మద్యం, ఆటో, నగదు చోరీ, వాచ్‌మన్‌పై దాడి కేసులో ముగ్గురు నిందితులను కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ బుధవారం అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దొంగతనాల కేసుల్లో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఇందిరానగర్‌కు చెందిన కట్ట హన్సర్ అలియాస్ గడాఫ్(19), నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జమలంకు చెందిన ఇంజపల్లి జగదీశ్వర్(19)లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు జైలుకు తరలించారు. కరీంన గర్ చెందిన మైనర్ బాలుడును కూడా అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు దేవదాస్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం ఈ నెల 10న అర్ధరాత్రి ఒంటి గంటకు కరీంనగర్‌రూరల్ మండలంలోని ముగ్దుంపూర్ వినాయక వైన్స్ వద్ద వాచ్‌మన్ బడుగు అంజయ్యపై దాడి చేశారు. షాపు షట్టర్‌ను పగలగొట్టి అందులో నుంచి 39 వేల రూపాయల విలువగల మద్యాన్ని, క్యాష్ కౌంటర్ నుంచి 28 వేల రూపాయల నగదుతో పాటు వాచ్‌మన్ మొబైల్ ఫోన్లను దొంగిలించారు. మరో సంఘటనలో అదే రోజున దుర్శేడ్ గ్రామానికి చెందిన బలుసుల సంపత్ తన ఆటోను రాత్రి 9 గంటల సమయంలో ఇంటి ముందు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయాన్నే చూడగా తన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసు ఠాణాలో కేసు నమోదైంది. ఈ రెండు కేసుల్లో నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు కరీంనగర్‌లోని బొమ్మకల్ బైపాస్ వద్ద మంగళ వారం నిర్వహించిన వాహన తనిఖీల్లో కరీంనగర్ నుంచి అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు ఒక ఆటోలో వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తనిఖీ చేయగా వారివద్ద 55 గ్రాముల గంజాయి పట్టుబడింది. పోలీసుఠాణాకు తరలించిన అనంతరం అనుమానితులను విచారించగా మరో ఇద్దరితో కలిసి మొత్తం నలుగురు దుర్శేడ్‌లో ఆటో దొంగతనం, ముగ్దుంపూర్ వైన్‌షాపులో చోరీ, వాచ్‌మెన్‌పై దాడి, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. ఇందులో ముగ్గురుపై నిజామాబాద్ పోలీసు ఠాణాలో దొంగతనం కేసు కూడా నమోదైందని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గంభీరావుపేట సెప్టెంబరు 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన బరిగెల కిషన్ (40) బుధవారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన కిషన్ 45రోజుల క్రితం బైక్‌పై మాచారెడ్డి వెళ్లి తిరిగి వస్తున్నాడు. మాచారెడ్డి, నర్మాల క్యాంపు మార్గ మధ్యలో వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన కిషన్‌ను ముందుగా సిరిసిల్ల అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

ఐడీ కార్డులు అందజేత

జూలపల్లి, సెప్టెంబరు 18:మండలంలోని వడుకాపూర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు దూస రమేష్ బుధవారం స్వంత ఖర్చులతో ఐడీ కార్డులను సమకూర్చి అందించారు. ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

ఓదెల, సెప్టెంబరు 18 : మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2లక్షల 50 వేల చెక్కును ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు వారి కుటుంబ సభ్యులకు అందించారు.

ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా ప్రశాంత్

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 18: కాలనీ ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా పరకాల ప్రశాంత్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ నియాకపత్రాన్ని ప్రశాంత్‌కు అందజేశారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 18: కాలనీ ప్రజల సౌకర్యార్థం గురువారం హనుమాన్‌నగర్‌లో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు మాజీ కార్పొరేటర్ కొండ్ర స్టాలిన్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌నగర్‌లోని జనతాగారేజీలో హైద్రాబాద్ శ్రీనేత్రాలయ ఆసుపత్రికి చెందిన నేత్రవైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. నేత్ర సంబంధిత సమస్యలతో ఆపరేషన్ అవసరమైన వారికి వైద్యులు హైదరాబాద్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 9704439523, 9701650555 నంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

డీటీఎఫ్ కార్యవర్గం

కమాన్‌పూర్, సెప్టెంబరు 18 :మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం డీటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. శాఖాధ్యక్షుడిగా సదయ్య, ప్రధాన కార్యదర్శిగా కె. రాజు, ఉపాధ్యక్షులుగా ఎస్. పుష్పలత, ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులుగా ఎస్ స్వరూపరాణి,కె శ్రీనివాస్, ఎం. రాజు, జిల్లా కౌన్సిలర్లుగా షేక్ సంశోద్దీన్, వి. మల్లేశ్వర్ రావు, జి రమేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సిహెచ్ గంగారం, సభ్యులుగా టీ. శంకర్, రవికుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, జిల్లా అధ్యక్షుడు రామ్‌కిషన్‌రావు, ఉపాధ్యక్షుడు షేక్ సంశుద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్‌రావులు హాజరయ్యారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 18 : పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు గురువారం మండల వివిధ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపడీవో గనుకోట శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా ముసాయిదా ప్రకటనపై చర్చించనున్నట్లు, అన్ని పార్టీ మండల అధ్యక్షులు ఈ సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు.

ముత్తారం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు పొలిటికల్ లీడర్లకు ఓటర్ జాబితాపై అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో సురేష్ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం మందిరంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు, అన్ని గ్రామాల పొలిటికల్ లీడర్స్, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 18 : అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు షీ టీం బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం బృందం ఏఎస్ఐ మల్లన్న ప్రమాదం ఎదురైనప్పుడు డయల్ 100సేవలు వినియోగించాలని వివరించారు. సైబర్‌క్రైం బారినపడినప్పుడు 1930కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అర్చన, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.శ్రీలత, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, అధ్యాపకులు, డబ్ల్యూపీసీ స్నేహలత, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్జీ-2 ఏరియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్వోటూ జీఎం సంతోష్

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 18: వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్జీ-2 ఏరియా వార్షిక క్రీడలను బుధవారం ఆఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్ ప్రారంభించారు. స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో డిపార్ట్‌మెంటల్ వాలీబాల్ పోటీలను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. సింగరేణీయులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, ఏదైనా క్రీడలో నైపుణ్యం సాధించేలా సాధన చేయాలని సూచించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఎస్ఎస్‌ఓ షరీఫ్ మహమ్మద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సీహెచ్ పోశం పాల్గొన్నారు.

ఆర్జీ-2 డీజీఎంగా అనిల్‌కుమార్

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 18: ఆర్జీ-2 ఏరియా డీజీఎం(పర్సనల్)గా అనిల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీజీఎంగా పని చేస్తున్న రాజేంద్రప్రసాద్ కార్పొరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో అనిల్‌కుమార్ నియమితులయ్యారు. పర్సనల్ విభాగం అధికారులు, జీఎం ఆఫీస్ సిబ్బంది అనిల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ వంశీధర్, సిబ్బంది సీహెచ్ సత్యనారాయణ, శివశంకర్, మౌనిక, జయ, సమత, సతీష్ ఉన్నారు.

ఆర్జీ-3లో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, సెప్టెంబరు 18: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయంలో ఆవరణలో బుధవారం అధికారులు క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కాలనీలో 207ఖాళీ క్వార్టర్స్‌లో ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్‌ఆఫ్ క్వార్టర్స్‌కు 71మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 30మంది కార్మికులు హాజరుకాగా 27మంది కార్మికులు క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టూజీఎం బండి సత్యనారాయణ, అధికారులు సుదర్శనం, గుర్రం శ్రీహరి, మహేందర్, సదయ్య, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ అర్హత పత్రాల అందజేత

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 18: స్థానిక 15వ డివిజన్ పరిధిలో రూ.500గ్యాస్ సిలిండర్ లబ్దిదారులకు బుధవారం కార్పొరేట్ బదావత్ శంకర్‌నాయక్ అర్హత పత్రాలను అందజేశారు. సింగరేణి స్థలాల్లో నివాస స్థలాలు ఏర్పాటు చేసుకున్న వారికి పట్టాలు ఇచ్చేలా సర్వే చేయాలని ఎమ్మెల్యే సింగరేణి అధికారులకు సూచించారని, త్వరలో సర్వేచేసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి : కలెక్టర్



పాఠశాల విద్యపై హెడ్‌మాస్టర్లు, అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్



కాచాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 18 : ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో పాఠశాల విద్యపై ఓదెల మండల హెడ్‌మాస్టర్‌లతో సమీక్షించారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమం అమలు, పాఠశాలలో విద్యార్థులు మానిటరింగ్, విద్యా బోధన విధానాలు, ప్రస్తుత విద్యా సంవత్సరం రూపొందించుకున్న లక్ష్యాలు మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో చేరుకునేలా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హెడ్‌మాస్టర్‌లకు సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు ఆలస్యంగా హాజరవుతున్నారని ఎటువంటి ఫిర్యాదులు రావద్దని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరుకావాలని, హాజరు తక్కువ ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించి వారి ఇంటికి వెళ్లి ఫాలోఅప్ చేసే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి కనీస విద్య ప్రమాణాలు అందే దిశగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. పాఠ్యాంశాన్ని విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధించాలని, పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లంలో చదువడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ వంటి విద్య ప్రమాణాలు నేర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, ఏ.ఎంవో డాక్టర్ పీఎం షేక్, ఓదెల మండలంలోని పాఠశాలల హెడ్ మాస్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

జూలపల్లి, సెప్టెంబరు 18 : ప్రభుత్వ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండల కేంద్రంతో పాటు కాచాపూర్ గ్రామాల్లో బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కాచాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు అందుతున్న విద్యపై విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కనీస విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించే దిశగా ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ధరణి సమస్యలపై ప్రజలు అందించిన పెండింగ్ దరఖాస్తులపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు వాటిపై దృష్టి సారించాలని వారికి సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలోని ఉపాధిహామీ పనులు, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల సంరక్షణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజాపాలన దరకాస్తులు, ప్రభుత్వ గ్యారంటీ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని వారికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కోయా శ్రీహర్ష ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో జరుగుతున్న ఎన్‌సీడీ నాణ్యతను పర్యవేక్షించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేయాలి

- అదనపు కలెక్టరుకు ఏబీవీపీ నేతల ఫిర్యాదు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 18: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో పరారీలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖాద్రీని వెంటనే అరెస్ట్ చేయాలని ఏబీవీపీ నాయకులు అదనపు కలెక్టరు అరుణశ్రీకి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కోడి అజయ్ మాట్లాడుతూ కాల్వశ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న అబ్దుల్ ఖాద్రీ, సదానందం ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినులతో ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, నగర కార్యదర్శి అజయ్, నాయకులు అరవింద్, సాయి తేజ, సందీప్ ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మైక్ సెట్ వితరణ

మండలంలోని ఇప్పలపల్లె గ్రామంలో గల అభయ ఆంజనేయ స్వామి గుడికి మైక్‌సెట్‌ను ఏగోల సదయ్యగౌడ్ అందజేశారు. మైక్‌సెట్ ఇచ్చినందుకు అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఏగోలపు సదయ్యగౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి సంగీతమహేందర్‌యాదవ్, ఆలయ చైర్మన్ జిల్లాల ఐలయ్య, అల్లముల రాజు, బైరి కుమార్, కూస రాజు, మెర్గవేన సురేష్, అన్నారపు రాజు, వడ్లూరి రాజేష్, మెర్గవెన రవి, రమేష్, చెర్ల అనూష, వడ్లూరి సాగర్, కొండపర్తి రవి తదితరులు పాల్గొన్నారు.



గుంతలమయమైన కుర్మపల్లి రోడ్డు

గుంతలమయమైన రోడ్డు.. వాహనదారుల ఇబ్బందులు

పాలకుర్తి, సెప్టెంబరు 18: మండలం పరిధిలోని ధర్మారం అడ్డరోడ్డు నుంచి ఎండపల్లి మండలం రాజరాంపల్లి వరకు వెళ్లే రోడ్డు కుర్మపల్లి తీన్‌రస్తా వద్ద గుంతల మయంగా మారింది. అలాగే పుట్నూర్ తీన్‌రస్తా వద్ద గుంతలమయం కావడంతో గ్రామానికి చెందిన వేల్పుల రాజ్‌కుమార్ ఇటీవల స్వంత ఖర్చులతో తాత్కాలికంగా డస్ట్ పోయించి పూడ్చారు. ధర్మారం అడ్డరోడ్డు నుండి ఎయిర్‌పోర్టు వరకు ఏనాడో కేశోరాం కంపెనీ నిర్మించిన సీసీ రోడ్డు సైతం పలు చోట్ల పగుళ్లుతేలి గుంతలుగా మారడంతో ఆ రోడ్డు మార్గాన ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పుట్నూర్ తీన్‌రస్తా వద్ద ప్రతి మంగళవారం కూరగాయల సంత జరుగుతుంది. దీంతో సమీప గ్రామాల నుంచి సంతకువచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నుంచి జయ్యారం గ్రామ శివారులోని మల్లన్న గుట్టకు కంకర క్వారీల నుంచి పెద్దపెద్ద బండరాళ్లను కన్నాల సమీపంలోని క్రషర్లకు భారీ వాహనాల ద్వారా తరలించడం మూలంగా రోడ్డు మరింత గుంతలుగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవినీతిపరుల సమాచారమిస్తే రూ.10వేల నజరానా

- సీఎండీ బలరాం

గోదావరిఖని, సెప్టెంబరు 18: సింగరేణి సంస్థలో అవినీతి, అక్రమాలకు స్థానం లేదని సీఎండీ బలరాం అన్నారు. అన్‌ఫిట్ చేయిస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామని అక్రమాలకు పాల్పడే వారి సమాచారం ఇస్తే రూ.10వేల నజరానా ఇస్తానని ఆయన చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన విజిలెన్స్ విభాగంలో సమీక్షలో సీఎండీ మాట్లాడారు. సింగరేణి పూర్తి పారదర్శకంగా, అవినీతి రహితంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది అక్రమార్కులు అమాయక కార్మికులను మోసం చేస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే మెడికల్ బోర్డు అక్రమాలపై రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ దర్యాప్తు చేస్తుందని ఆయన చెప్పారు. ఇటీవల మెడికల్ బోర్డు ప్రక్రియలో దళారులపై సీఐడీ నివేదిక ఇచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే మెడికల్ బోర్డు సహా కంపెనీకి నష్టం కలిగించే పనులు చేస్తున్న ఉద్యోగులపై కూడా చర్యలు ఉంటాయన్నారు. అవినీతికి పాల్పడుతున్న వారి వివరాలను కంపెనీ విజిలెన్స్ విభాగం 9491144104 నంబర్‌కు తెలియజేయాలన్నారు. అక్రమార్కులకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు వారికి రూ.10వేల ప్రోత్సాహకం కూడా ఇస్తామన్నారు. కారుణ్య నియామక ఉద్యోగ ప్రక్రియలో సింగరేణి ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్టు తేలితే వారి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తప్పుడు ధ్రువీకరణపత్రాలు సమర్పించి అన్‌ఫిట్ అవుతున్న వారికి కంపెనీ ద్వారా లభించే ప్రయోజనాలను నిలిపివేస్తామని హెచ్చరించారు. అనారోగ్యాలతో బాధపడేవారి కోసమే కారుణ్య నియామక ప్రక్రియను అమలుచేస్తున్నట్టు స్పష్టం చేశారు. సింగరేణిలో జరుగుతున్న కాంట్రాక్టు పనుల నాణ్యతపై కూడా విజిలెన్స్ నిఘాను పెంచాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జీఎం (విజిలెన్స్) ప్రసాద్‌రావుతో పాటు విజిలెన్స్ విభాగం అధికారులు పేర్కొన్నారు.

ఏకపక్ష నిర్ణయంతో విరాళం సరికాదు : సీఐటీయూ

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 18: వరద బాధితుల సహాయార్థం సింగరేణి కార్మికుల ఒకరోజు వేతనాన్ని సహాయంగా యాజమాన్యం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఆర్జీ-2 ఏరియా యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, జిల్లా నాయకుడు ఉల్లి మొగిలి మాట్లాడారు. కార్మికుల శ్రమతో సంస్థను లాభాల్లో తీసుకువస్తుంటే యాజమాన్యం ఆర్థిక అంశాల్లో ఇష్టారీతిన వ్యవహరిస్తూ సంస్థకు, కార్మికులకు నష్టం చేసే తీరుగా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా విరాళాలు అడగాల్సిందిపోయి పైస్థాయిలో ఒకరోజు వేతనాన్ని కార్మికుల అనుమతి లేకుండా తీసుకోవడం సరైన విధానం కాదని అన్నారు. మెడికల్ కాలేజీ పేరిట వంద కోట్లు, సివిల్స్ అభ్యర్థులకు లక్ష చొప్పున ఆర్థిక సాయం వంటి వాటికి ప్రభుత్వ నిధులు వినియోగించాల్సి ఉంటుందని, కానీ సింగరేణి నిధులు ఇవ్వడం ఎక్కడి పద్ధతి అని ప్రశ్నించారు. పన్నుల రూపంలో కార్మికుల వేతనంలో కొంత నష్టపోతున్నారని, వరదలు వంటి ఉపద్రవాలకు కూడా కార్మికుల అనుమతి లేకుండా వేతనాన్ని రికవరీ చేయడం సరికాదన్నారు. యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆర్జీ-2 ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

15రోజుల్లో లాభాల వాటా ఇప్పిస్తాం..

- ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 18: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రానున్న 15 రోజుల్లో సింగరేణి కార్మికులకు లాభాల వాటా అందేలా చూస్తామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. బాయిబాట కార్యక్రమంలో బుధవారం జీడీకే సీఎస్‌పీ-1లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని, పెర్క్స్‌పై విధించే ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేయిస్తామని ఆయన కార్మికులకు హామీఇచ్చారు. ఈ గేట్ మీటింగ్‌లో కేంద్ర నాయకులు టైసన్ శ్రీనివాస్, గడ్డం కృష్ణ, మండ రమేష్, పుట్ట రమేష్, మల్లికార్జున్, ఏ శ్రీనివాస్, నాగరాజు, సాగర్, శంకర్, జగన్, ఆంజనేయులు, నయీం పాల్గొన్నారు.

మెరుగైన లాభాల వాటా ఇప్పించేందుకు కృషి..

ఖైటింక్లయిన్‌కాలనీ : కార్మికులకు మెరుగైన లాభాల వాటా ఇప్పించేలా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం ఓసీపీ-3 కృషి భవన్, బేస్ వర్క్‌షాప్‌లలో జరిగిన గేట్‌మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీల్లో కొన్ని అమలుచేశామని, మిగిలినవి అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళనున్నట్టు తెలిపారు. పెర్క్స్ మీద ఐటీ రీయింబర్స్, స్వంత ఇంటి పథకం అమలు, మహిళా ఉద్యోగినులకు పని స్థలాల్లో రక్షణ కల్పించడం, పని స్థలాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. 15రోజుల్లో లాభాల వాటా చెల్లించేలా యూనియన్ పక్షాన యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమం, రక్షణకు పెద్దపీట వేసేలా పనిచేస్తుందని అన్నారు. ఐఎన్‌టీయూసీ సాధించిన పనులను తాము చేసినట్టు ఇతర యూనియన్లు ప్రచారం చేసుకోవడానికే పరిమితమయ్యాయని, కార్మికుల పక్షాన నిలవాలనే స్పృహ లేకుండా పోయిందని విమర్శించారు. ఈ గేట్ మీటింగ్‌లో యూనియన్ జనరల్ సెక్రెటరీ అక్రం, నాయకులు లక్ష్మీపతి గౌడ్, సంపత్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఎట్టెం కృష్ణ, సీహెచ్ ప్రసాద్, మార్కండేయ, దశరథం, సలిగంటి రాములు, లక్ష్మణరావు, బర్ల రవీందర్, కనకయ్య, అవినాష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పాలకుర్తి,సెప్టెంబరు 18: మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ముగ్గురికి షాదీ ముబారక్ చెక్కులను, 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, జీడీనగర్ మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య, ఎంపీడీవో పొల్సాని శశికళ, తహసీల్దార్ ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు

లబ్ధిదారులకు కోడి పిల్లల పంపిణీ

పాలకుర్తి, సెప్టెంబరు 18: మండలంలోని జనని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు పెద్దపల్లి డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్ కోడి పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఓబీలు, డీపీఎం రవి, ఏపీఎంలు సదానందం, పోచం పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు అవకాశం

ముత్తారం, సెప్టెంబరు 18: మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ఓటరు జాబితాను సవరించుకునేందుకు ఈనెల 20 వరకు గడువు ఉన్నట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు కారోబార్లు కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను సవరించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకొని పంచాయతీ కార్యదర్శులు కంప్యూటర్ ఆపరేటర్ వద్ద ఆన్లైన్ చేసి జాబితాను సరి చేయాలని వారికి సూచించారు వార్డుల తేడాలు, గ్రామ పంచాయతీలో తేడాలు ఉంటే గుర్తించి వాటిని సరి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కారోబార్లు కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కరాటే విజేతలను అభినందించిన కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 18 : కరీంగనర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 15న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే కాంపిటేషన్ పోటీల్లో పెద్దపల్లి జిల్లా కు చెందిన స్మార్ట్‌కిడ్స్ పిల్లలు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో స్మార్ట్ కిడ్స్ విద్యార్థులు మాణిమాత్, ఆర్యన్ ఆద్వికలు గోల్డ్ మెడల్, హర్షవర్ధన్, యశ్వంత్, ప్రణవ్‌చంద్ర, శ్రీహన్‌లు సిల్వర్ మెడల్, అభిరాం కాంస్య పతకాన్ని సాధించారు. వీరిని బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సర్టిఫికేట్ లు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు అక్కినేని శతజయంతి ఉత్సవాలు

మంథని, సెప్టెంబరు18: అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలను మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కొండేల మారుతి వెల్లడించారు. బుధవారం కొండేల మారుతి విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఫ్రెండ్స్‌లో ఏర్పాటు చేసే అక్కినేని శత జయంతి ఉత్సావాల్లో అక్కినేని అభిమానులు, వివిధ రంగాలకు చెందిన వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 22న ఫ్రెండ్స్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారులకు సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు ఈమేరకు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సర్వ చిన్నబాబు, మారుతి పాల్గొన్నారు.

'దళిత బంధు నిధులు విడుదల చేయాలి'

మంథని, సెప్టెంబరు 18: మంథని నియోజకవర్గానికి గత ప్రభుత్వం మంజూరు చేసిన దళిత బంధు రెండో విడత నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంథని డివిజన్ దళిత బంధు సాదన సమితి అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ బుధవారం కోరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన సొంత నియోజకవర్గంలో దళిత బంధు రెండో విడుదత నిధుల మంజూరు పత్రాలను అందజేయడం శుభ పరిణామన్నారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న తన నియోజకవర్గంలో దళిల బంధు మంజూరు నియామకపు పత్రాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కరారు.

వినాయక నిమజ్జనం

జూలపల్లి, సెప్టెంబరు 18: మండలంలోని వడుకాపూర్ గ్రామంలో గల ఛత్రపతి శివాజి యూత్‌ఆధ్వర్యంలో గొల్లవాడ కమిటీహాల్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అబ్బోజు రాము, వేల్పుల సతీష్, వేల్పుల లింగయ్య, వేల్పుల అజయ్, వేల్పుల కిరన్, మెండె రాజ్‌కమార్, దాడి శ్రీనాద్, అట్ల అజయ్, వేల్పుల కొండయ్య పాల్గొన్నారు.

ఇందుర్తిలో కొండచిలువల భయం..

ఓదెల, సెప్టెంబరు 18: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన మారం రవిందర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న సీతాఫలం చెట్టుపై కొండచిలువ కనిపించింది. అలాగే మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లన్నీ గుబురుగా పచ్చదనంతో పెరగడంతో కొండచిలువలకు ఆవాసం అవుతున్నాయి. ఓదెల గుట్ట ప్రాంతంలో కూడ కొండచిలువలు చెట్లపై ప్రతిరోజు తిరుగుతుండటంతో చుట్టూ ప్రక్కల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. గుబురుగా పెరిగిన చెట్లపై ఉండటంతో కాపరులు వెళ్లేందుకు జంకుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 18: తెలంగాణ రాష్ట్ర ఈజీఎస్ సాంకేతిక సహాయకులు అధ్యక్షులు సంజీవ్ ఇటీవల పే స్కేల్ అమలు చేయకపోవడం పట్ల బాధపడుతూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా రాష్ట్ర వ్యాప్తంగా ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులంతా కలిసి వారి కుటుంబానికి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా 5 లక్షల రూపాయల చెక్కును అందించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పే స్కేల్ అమలు చేయాలని మంత్రికి విన్నవించారు. ఈసందర్భంగా మంత్రిని కలిసిన వారిలో పెద్దపల్లి జాక్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్‌తో పాటు పలువురు జిల్లా నుండి పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 18: విధి నిర్వహణలో మరణించిన కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చి అన్ని విధాల ఆదుకోవాలని గ్రామ పంచాయతీ జిల్లా అధ్యక్షులు సీపెల్లి రవీందర్ బుధవారం డీపీవోకు వినతి పత్రం అందజేశారు. ఈనెల 14న రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లిలో గ్రామపంచాయతీ కార్మికుడు నల్లూరి కళ్యాణ్‌ప్రసాద్ విధులు నిర్వహిస్తున్న సమయంలో తేలు కుట్టి మరణించాడన్నారు. ఆ కార్మికుని కుటుంబాన్ని ఆదుకొని 10 లక్షల రూపాయల నష్టపరిహారంతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కల్లెపల్లి అశోక్, మొదుంపల్లి శ్రావణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 18: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో గనుకోట శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు గ్రామాల్లో పారిశుధ్యం, శానిటేషన్ పనలు, పాఠశాలలు, ఆసుపత్రులను పరిశీలించారు. వెంట ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు ఝాన్సీ, సంతోష్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది'

పాలకుర్తి, సెప్టెంబరు 18: అమలు కాని ఆరు గ్యారంటీలను వాగ్దానం చేసి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేటముంచిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి ప్రభుత్వ పనితీరును తప్పుపట్టారు. బుధవారం మండలం పరిధిలోని బసంత్‌నగర్ కోదండ రామాలయం ఆవరణలో బీఆర్ఎస్ మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా హరి మాట్లాడుతూ బీఆర్ఎస్ శనివారం పాలకుర్తి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, టీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గం అధికార ప్రతినిధి తొడేటి శంకర్‌గౌడ్, కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.